

## అమరేశ్వరుని సేవలో మంత్రి రోజా

అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా శుక్రవారం దర్శించుకున్నారు.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 522.30 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



## భక్తజన సందడి

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వార్ల సన్నిధిలో శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీ కనిపించింది. పంచహారతులు, దీపార్చనలోనూ పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### కలెక్టర్ ఔదార్యం

పేద మహిళకు రూ.లక్ష ఆర్థిక సాయం



కలెక్టరేట్‌లో మహిళకు ఆర్థిక సహాయం అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: ఏమాత్రం సంపాదించే అవకాశంలేని ఓ పేద మహిళకు కలెక్టర్ ఎల్.శివశంకర్ రూ.లక్ష ఆర్థిక సహాయం అందించారు. చిలకలూరిపేటకు చెందిన నంబూరు నాగ సత్యవాణి కలెక్టర్ శివశంకర్ లోతేటిని కలిసి తన గోడు వెళ్లబోసుకుంది. తన భర్త శివప్రసాద్, చిన్న కుమార్తె అనారోగ్యంతో మృతిచెందారని, వితంతువైన పెద్ద కుమార్తె తన వద్దనే ఉంటుందని, ఆమెకు ఆరోగ్యం సరిగా లేదని, ఏమాత్రం సంపాదనకు అవకాశం లేనందున ఆర్థిక సాయం అందించాలని విన్నవించుకుంది. తక్షణం స్పందించిన కలెక్టర్ మానవతా దృక్పథంతో రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని మీడియా పాయింట్ వద్ద అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

### నలుగురికి డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర వ్యాప్తంగా 15 మంది ఎస్‌హెచ్‌ఓ (సీఐ)లకు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో గుంటూరు రేంజ్ పరిధిలోని నలుగురు సీఐలు ఎం.హనుమంతరావు, టి.వి.రత్న స్వామి, షేక్.అబ్దుల్‌కరీం, కె.వెంకటేశ్వరరావు డీఎస్పీలుగా ఉద్యోగోన్నతి పొందారు. వీరికి వెంటనే ప్రభుత్వం డీఎస్పీలుగా పోస్టింగ్‌లూ ఇచ్చింది. ప్రకాశం జిల్లా ఒంగోలు పీటీసీలో ఉన్న ఎం.హనుమంతరావును సీఐడీ డీఎస్పీగా, గుంటూరు జిల్లాలో వెయింటింగ్‌లో ఉన్న రత్నస్వామిని గుంటూరు జిల్లా స్పెషల్ బ్రాంచి (ఎస్‌బీ) డీఎస్పీగా, ప్రస్తుతం సీఐడీలో ఉన్న షేక్. అబ్దుల్ కరీంను పీసీఎస్/ఎస్‌డీఎస్పీగా, వేమూరు సర్కిల్ (జీటీఆర్)లో ఉన్న కె.వెంకటేశ్వరరావును విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా ఉన్నతాధికారులు నియమించారు. గుంటూరు జిల్లా ఎస్‌బీ డీఎస్పీని ఇటీవల అవినీతి ఆరోపణల నేపథ్యంలో వీఆర్‌కు పంపించినప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ప్రస్తుతం టి.వి.రత్నస్వామితో ఆ పోస్టును భర్తీచేశారు.

### 13న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సులో భర్తీ కాగా మిగిలిన సీట్లను పూరించేందుకు ఈనెల 13న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. ప్రభాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీ, ఎంపీసీ రెగ్యులర్‌గా పూర్తి చేసిన విద్యార్థినులతోపాటు దూర విద్య విధానం ద్వారా పూర్తి చేసిన విద్యార్థినులూ అర్హులేనని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు, రూ.6,300 ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో వసతి సదుపాయం కలదని, స్పాట్ అడ్మిషన్ ద్వారా సీటు పొందే విద్యార్థినులకు ఎటువంటి ఫీజు రాయితీ, స్కాలర్‌షిప్ వర్తించబోవని స్పష్టం చేశారు.

### పురాతన శివాలయం పునర్నిర్మాణానికి శ్రీకారం



యడ్లపాడు: సుమారు రెండు శతాబ్దాల నాటి పురాతన శివాలయ పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. వంకాయలపాడులోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం శిథిలావస్థకు చేరింది. ఆరు నెలల కిందట ధర్మకర్తలు ఆలయం పునర్నిర్మించాలని నిర్ణయించుకున్నారు. గ్రామస్తుల సహకారంతో మూడు నెలల కిందట ఆలయాన్ని పూర్తిగా తొలగించారు. కార్తికమాసం శుక్రవారం ఉదయం 9.40 గంటలకు నూతన ఆలయానికి ముహూర్తం ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గుంటూరుకు చెందిన నాగేశ్వరం రాఘవేంద్రశర్మ పర్యవేక్షణలో రుత్వికుల వేద మంత్రోచ్చరణల మధ్య హోమపూజలు చేశారు. ఆయా పూజల్లో దంపతులు పాల్గొన్నారు. గ్రామస్తుల సంపూర్ణ సహకారంతో సుమారు రూ.కోటి వ్యయంతో దీనిని నిర్మిస్తున్నట్లు ధర్మకర్తలు తెలిపారు.

# సేద్యానికి స్థైర్యం

- నేనున్నానంటూ.. భరోసా
- ఆదరించి.. అక్కున చేర్చుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- బాపట్ల జిల్లా పాతనందాయపాలెంలో మిర్చి పంట పరిశీలన
- బుద్దాంలో వరి పంట పరిశీలన
- రైతులతో ముఖాముఖి
- సంక్రాంతిలోపే ఇన్‌పుట్ సబ్సిడీ
- బాధిత రైతులందరికీ బీమా
- అభయమిచ్చిన వరాల రేడు

గుండె తడి ఆరక మౌనంగా రోదిస్తున్న పుడమితల్లి వరాల రేడు ఆత్మీయంగా స్పృశించినట్టు పులకించింది. నేలవాలిన వరి కంకులు ఆదుకునే ఆపన్నహస్తమేదో వెన్ను నిమిరినట్టు పరవశించాయి. నీటకరిచిన మిరప మొక్కలు చల్లనిచూపేదో తాకినట్టు ఊరడిల్లాయి. కంటికి రెప్పలా సాకిన పంట కళ్లెదుటే పడిపోతే నిలువునా కుప్పకూలిన అన్నదాత 'నేనున్నానన్న' చిరు పలకరింపునకు కదిలిపోయాడు. కారుచీకటిలో ఆశల దివ్వెలేవో వెలిగినట్టు మోము నిండుగా నవ్వులు చిందించాడు. ఇక వరాల పంట పండినట్టేనని మురిసిపోయాడు. దీనజనా'కర్షక'.. జయహో జగన్ అంటూ నినదించాడు. బాపట్ల జిల్లా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ఆద్యంతం దిగ్విజయంగా సాగింది. కర్షకులకు కొండంత భరోసానిచ్చింది.



నవ్వుల వసంతం : కర్లపాలెం మండలం పాతనందాయపాలెంలో రైతుతో కలిసి నవ్వులు చిందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి,బాపట్ల: "మీ బిడ్డ ప్రభుత్వంలో ఏ ఒక్కరికీ నష్టం, ఇబ్బంది జరగదు. తుఫాన్ వల్ల జరిగిన నష్టం అపారం. జరగాల్సిన సహాయం, పారదర్శకంగా జరుగుతుంది. వేగంగా జరుగుతుంది. గత ప్రభుత్వాల కంటే మిన్నగా జరుగుతుంది. మీ చేయిపట్టి తీసుకెళ్లి న్యాయంచేసే సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థ మనది. ఏ ఒక్కరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు." అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోని తుఫాన్ బాధిత రైతులకు భరోసా ఇచ్చారు. శుక్రవారం సీఎం బాపట్ల జిల్లాలోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈదురుగాలులు, భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**సీఎం ప్రసంగానికి హర్షధ్వానాలతో మద్దతు**

ముఖ్యమంత్రి తిరుపతి జిల్లా పర్యటన ముగించుకొని శుక్రవారం మధ్యాహ్నం 2.24 గంటలకు బాపట్లకు వచ్చారు. మరుప్రోలువారిపాలెం వద్ద 216 జాతీయ రహదారిపై హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన తుఫాన్ ప్రభావ ఫొటో గ్యాలరీని సందర్శించారు. బాధిత ప్రజలతో మాట్లాడారు. ఆ తరువాత 2.52 గంటలకు హెలిప్యాడ్ ప్రాంతం నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 3.06 గంటలకు కర్లపాలెం మండలం పాతనందాయపాలెం వద్ద నీట మునిగిన మిర్చి పంటను పరిశీలించారు. అక్కడే రైతులను కలిసి మాట్లాడారు. 3.23 గంటలకు రైతులనుద్దేశించి ముఖ్యమంత్రి ప్రసంగించారు. రైతులకు తమ ప్రభుత్వం ఎలా అండగా ఉంటూ వస్తోందో వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో ప్రతి ఏటా రైతులకు బీమా, నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు ప్రభుత్వం రైతులకు రూ.7,800 కోట్లు ఇచ్చినట్లు సీఎం వెల్లడించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి అడుగడుగునా రైతులు హర్షధ్వానాలతో మద్దతు పలికారు. ఈ ఏడాది సంక్రాంతి నాటికి ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని సీఎం ప్రకటించగానే అన్నదాతలు జయజయధ్వానాలు చేశారు. ఈలలు కేకలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు.



జై కిసాన్.. జై జగన్ : పాతనందాయపాలెంలో జరిగిన సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రంలో మంత్రి మేరుగ నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ రంజిత్‌బాషా

**కాలువల సమస్యకు పరిష్కారం**

చంద్రబాబు ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోలేదని సీఎం వైఎస్ జగన్ చెప్పగానే రైతులు నిజమేనంటూ గళం కలిపారు. తరువాత 3.48 గంటలకు బుద్దాం గ్రామం వద్ద నీటమునిగిన వరి పంటను పరిశీలించిన ముఖ్యమంత్రి అక్కడి రైతులతో మాట్లాడారు. ప్రధాన కాలువలు కుంచించుకుపోయాయని, ఫలితంగా వరద నీరు పొలాలపైకి వస్తోందని రైతులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. సీఎం వెళ్లే మార్గంలో దారిపొడవునా ప్రజలు ఇరువైపులా నిలుచుని జేజేలు పలికారు. తరువాత 4.30 గంటలకు ముఖ్యమంత్రి తిరిగి రోడ్డు మార్గాన హెలిప్యాడ్ వద్దకు చేరుకొని 4.45 గంటలకు హెలికాప్టర్‌లో తాడేపల్లికి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, హోంమంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, జీడీసీసీ చైర్మన్ లాలుపురం రాము, మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి, గాదె మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఉన్నారు.

# నష్ట నమోదుకు నడిచేను

- కర్షకులకు పక్కాగా పరిహారం
- నేటి నుంచి దెబ్బతిన్న పంటల నమోదు
- పొలాల బాట పట్టనున్న అధికారులు
- గ్రామ స్థాయిలో వీఆర్వో, వీఏఓ, వీహెచ్‌ఓలతో కమిటీ
- మండల, జిల్లా స్థాయిల్లో మానిటరింగ్ కమిటీల ఏర్పాటు
- ఈ నెల 19 నుంచి సచివాలయాల్లో అర్హుల జాబితాల ప్రదర్శన

| ప్రాథమిక నష్ట అంచనాలు ఇలా.. | (హెక్టార్లలో) |
|---|---|
| వ్యవసాయ పంటలు | : 15,878 |
| ఉద్యాన పంటలు | : 2,742.95 |

సాక్షి, నరసరావుపేట: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకునే ప్రక్రియను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వేగవంతం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు పంట నష్ట నమోదుకు వేగంగా కదులుతున్నారు. ఇప్పటికే చేల బాట పట్టిన అధికారులు ప్రాథమిక నష్టాలను అంచనా వేశారు. శనివారం నుంచి పూర్తిస్థాయి నష్టాల నమోదుకు నడుంకట్టనున్నారు. దీనికోసం అధికారులు బృందాలుగా ఏర్పడ్డారు. గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌ఓ), గ్రామ వ్యవసాయ/ ఉద్యాన శాఖ అధికారి, పంచాయతీ కార్యదర్శి ఓ బృందంగా పొలాలకు వెళ్లి నష్ట వివరాలు నమోదు చేయనున్నారు. నమోదు చేసిన వివరాలతో అర్హుల జాబితాను సిద్ధం చేసి మండల స్థాయికి పంపనున్నారు. వీటిని మండల స్థాయిలో తహసీల్దార్, మండల వ్యవసాయాధికారి, ఉద్యానశాఖ అధికారులు పరిశీలించి జిల్లాస్థాయికి పంపుతారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, జేడీఏ, డీహెచ్‌ఓలు మానిటరింగ్ చేస్తారు.

**19 నుంచి ఆర్‌బీకేలలో సోషల్ ఆడిట్**

7వ తేదీ నాటికి ఉన్న ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో 15,878 హెక్టార్లలో వ్యవసాయ, 2,742.95 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్టు అధికారులు లెక్కలు కట్టారు. తుఫాన్ కారణంగా 48,500 మంది రైతులు నష్టపోయారని భావిస్తున్నారు. వీరందరి పొలాలను శనివారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు పరిశీలించనున్నారు. తర్వాత 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ఆర్‌బీకేల పరిధిలో సోషల్ ఆడిట్ జరగనుంది. జాబితాలు ప్రదర్శించి రైతుల నుంచి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. తర్వాత తుది జాబితాను ఈనెల 27న రూపొందించి రాష్ట్ర వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ కార్యాలయాలకు పంపనున్నారు. 90 రోజుల్లోపు పంట నష్ట పరిహారం రైతుల చేతికి అందనుంది.

### ప్రతి రైతుకూ న్యాయం

మిచాంగ్ తుఫాన్ కారణంగా జిల్లాలో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో నేటి నుంచి క్షేత్రస్థాయిలో వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సమష్టిగా పంట నష్ట వివరాలను పరిశీలించి జాబితాలను సిద్ధం చేయనున్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ తప్పక న్యాయం చేస్తాం.

– శివశంకర్ లోతేటి, జిల్లా కలెక్టర్

# రైతులను ఆదుకోవడంలో ఏపీ ఆదర్శవంతం



తూబాడులో మిర్చి పంటను పరిశీలిస్తున్న మంత్రి రజిని, వ్యవసాయశాఖ అధికారులు

- రైతులకు పరిహారం అందిస్తాం
- 15లోగా ప్రభుత్వానికి నష్ట నివేదిక
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని వెల్లడి
- మిచాంగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన పొలాల పరిశీలన

నాదెండ్ల: అన్నదాతలను ఆదుకోవటంలో దేశంలోనే జగనన్న ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన పొలాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం తూబాడు, గున్నావారిపాలెం, రాజుగారిపాలెం, బుక్కాపురం గ్రామాల్లో జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. మిర్చి, పత్తి, శనగ, పొగాకు, కంది, మినుము, మిరప పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. చిలకలూరిపేట నియోజకవర్గంలో 6,470 హెక్టార్లలో పంట నష్టపోయినట్లు, శనగ, మిర్చి పంటలపై తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. 1,240 హెక్టార్లలో మిరప, నాలుగు వేల హెక్టార్లకుపైగా శనగ పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనాకు వచ్చినట్లు తెలిపారు. కొద్దిరోజుల్లో పూర్తిస్థాయిలో వివరాలు సేకరించనున్నట్లు చెప్పారు.

**ఉచితంగా శనగల పంపిణీ**

నియోజకవర్గంలో శనగ పంట మొదటి దశలో ఉండగానే తుఫాన్ ప్రభావంతో దెబ్బతిందని, బాధిత రైతులందరికీ వారం రోజుల్లో తిరిగి ఉచితంగా శనగలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ మేరకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఇప్పటికే అధికారులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. నివేదికలు ప్రభుత్వానికి అందిన వెంటనే నష్టపరిహారం పంపిణీ ప్రక్రియ మొదలవుతుందన్నారు.

**అధికారులు, శాస్త్రవేత్తల పర్యవేక్షణలో..**

తుఫాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్న రైతులకు నిరంతరం వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, లాం అధికారులు అందుబాటులో ఉండి సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మంత్రి రజిని పేర్కొన్నారు. తుఫాన్ ప్రారంభ రోజు నుంచి అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. మిర్చి తదితర పంటలు ఉరకెత్తకుండా తగు జాగ్రత్తలను శాస్త్రవేత్తలు రైతులకు వివరిస్తున్నట్లు పేర్కొన్నారు. శనగ పంట తిరిగి సాగు చేసుకునేలా అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, నష్ట తీవ్రత తగ్గేలా రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పంట నష్టం నమోదులో ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ఉండాలన్నారు. రైతులను ఆదుకోవటంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 15లోగా ప్రభుత్వానికి పూర్తి నివేదిక అందించనున్నట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, పల్నాడు జిల్లా వ్యవసాయ పరిశోధకుడు రమేష్, ఉద్యానవనశాఖ అధికారి కిషోర్‌కుమార్, ఏఓ హరిప్రసాద్, పార్టీ నాయకుడు విడదల గోపీ, సర్పంచ్ గోళ్లమూడి కాశయ్య, ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మార్కెట్‌యార్డు చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి, నాదెండ్ల పీఏసీఎస్ చైర్మన్ కురుకుంట్ల వెంకటరెడ్డి, నాయకులు పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, బత్తుల సీతారామిరెడ్డి, గుర్రం ఉపేంద్ర, దాట్ల విక్రమరాజు, సొలస భాస్కరరెడ్డి, మాదం శ్రీనివాసరావు, గోపు ఆంతోనిరెడ్డి, ఏరువ వివేక్‌రెడ్డి, సుందరరెడ్డి, తలతోటి రత్తయ్య, ఉయ్యూరు చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు షోకాలు

- ప్రచారయాత్రగా పర్యటన
- అర్ధరాత్రి వరకూ సాగిన వైనం
- పది మంది కనపడితే ఆగిపోయిన బాబు
- ఇతర ప్రాంతాల నుంచి కార్యకర్తల తరలింపు
- పరామర్శ కొద్దిసేపే.. మిగిలిందంతా ప్రచారమే..
- సుప్రీం ఆదేశాలు ఉన్నా కేసు గురించి మాట్లాడిన బాబు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: మిచాంగ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతంలో రైతులను పరామర్శించేందుకు శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లాకు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు తన పర్యటనను ప్రచార యాత్రగా మార్చుకున్నారు. జైలు నుంచి వచ్చిన తర్వాత మొదటి టూర్ కావడంతో ఈ యాత్రను పూర్తిగా తన ప్రచారం కోసం ఉపయోగించుకున్నారు. స్కిల్ స్కాం కేసుపై బయట ఎక్కడా మాట్లాడవద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నా ధిక్కరించి 45 ఏళ్లుగా టెక్నికల్‌గా, లీగల్‌గా ఏ తప్పూచేయని తనను జైల్లో పెట్టారని శోకాలు పెట్టారు. 52 రోజులు ప్రపంచమంతా తనకోసం ఆందోళన చేసిందని గొప్పలు పోయారు. బయట కొచ్చి ఆందోళన చేస్తేనే న్యాయం జరుగుతుందని రైతులను రెచ్చగొట్టేలా ప్రసంగించారు. కార్యకర్తలను భయపెట్టేందుకే తనను అరెస్టు చేశారని చెప్పుకున్నారు.

**టీడీపీ నేతల ఆప'షో'పాలు**

చంద్రబాబు పర్యటనను జయప్రదం అయిందని చెప్పుకునేందుకు టీడీపీ నేతలు ఆపసోపాలు పడ్డారు. పలుచోట్ల షోలు చేశారు. బాబు యాత్ర మొదలుపెట్టగానే రేవేంద్రపాడులో కొందరు టీడీపీ నేతలు రైతుల వేషంలో ఉరితాళ్లు మెడలకు బిగించుకుని తమకు న్యాయం చేయాలంటూ చంద్రబాబు వద్ద మొరపెట్టుకున్నారు. ఇక్కడి నుంచి ప్రారంభమైన ప్రచారార్భాటం అర్ధరాత్రి వరకూ కొనసాగింది. ఎక్కడ పది మంది కనపడినా బాబు ఆగిపోతూ వారితో మాట్లాడుతూ యాత్ర కొనసాగించారు. తెనాలి ప్రాంతంలో టీడీపీ, జనసేన కలిసి జనసమీకరణ చేసినా ఆశించిన స్పందన లేదు. నిన్నటి నుంచీ టీడీపీ నేతల వాట్సాప్ గ్రూపుల్లో, స్టేటస్‌లలో బాబు పర్యటన గురించి ఊదరగొట్టినా ఆ పార్టీ కార్యకర్తలే స్పందించలేదు. దీంతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విలేకరుల సమావేశం పెట్టి మరీ జయప్రదం చేయాలని కోరారు. అయినా ఎవరూ ఖాతరు చేయకపోవడంతో ట్రాక్టర్లు, ఆటోల్లో జనాన్ని తరలించారు. ఇంతచేసినా ఐదారు వందలకు మించి జనం రాలేదు. తెనాలి నుంచి, రూరల్ మండలం, కొల్లిపర మండలాల నుంచి తరలించిన జనాన్ని తిరిగి స్వస్థలాలకు చేర్చలేదు. సమావేశానికి తీసుకురావడం వరకే బాడుగ మాట్లాడారని ఆటోడ్రైవర్లు చెప్పడంతో చేసేదేమీ లేక జనం తిట్టుకుంటూ ఇంటిబాట పట్టారు. కొలకలూరు నుంచి కొందరు మహిళలను ప్రత్యేకంగా చంద్రబాబు పర్యటనకు తీసుకొచ్చారు. వారికి బాబు వెళ్లిపోయాక నందివెలుగు వంతెన దిగువన రూ.500 చొప్పున పంచారు.

### ఆలపాటి రాజా బలప్రదర్శన

తెనాలి నియోజకవర్గంలో మాజీ మంత్రి ఆలపాటి రాజా బలప్రదర్శన చేశారు. పొత్తుల్లో భాగంగా ఈ టిక్కెట్ తనకు దక్కదని తెలియడంతో చంద్రబాబును ఆకట్టుకునేందుకు నానా తంటాలు పడ్డారు. నందివెలుగు సెంటర్, అత్తోటలోని పంటపొలం వద్దకు జనసమీకరణ చేశారు. అక్కడి నుంచి తెనాలి వరకు మార్గమధ్యంలోని గ్రామాలు, పట్టణంలోని కూడలి ప్రాంతాల వద్ద జనాన్ని సమీకరించి, బాబుకు స్వాగతం పలికే ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం వీఎస్సార్ కాలేజీ నుంచి మార్కెట్ సెంటర్ వరకు విద్యార్థులను వందలమందిని నిలబెట్టారు. వీరిలో రాజాకు చెందిన ఎన్నారై కాలేజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉండటం గమనార్హం. వీరంతా రెండుగంటలకుపైగా బాబు కోసం వేచి ఉన్నారు. ఫలితంగా ట్రాఫిక్ రద్దీ నెలకొంది. అంబులెన్సు కూడా రద్దీలో చిక్కుకుంది. తర్వాత వేమూరు, రేపల్లె నియోజకవర్గాలలో పర్యటన కొనసాగింది. రాత్రి సమయంలోనూ కార్యకర్తలకు ఉపన్యాసాలు ఇవ్వడానికే బాబు పర్యటనను ఉపయోగించుకున్నారు. చీకటి పడ్డాక ఎక్కడా మునిగిన పొలాలను చూడకుండా ప్రసంగాలకే పరిమితమయ్యారు.

## క్లుప్తంగా

### జాతీయ స్థాయి శిక్షణకు వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు



బాపట్ల అర్బన్: వ్యవస్థాపక అభివృద్ధి ప్రణాళికలో భాగంగా జాతీయ ఉన్నత విద్య పథకం ద్వారా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు జాతీయ స్థాయి శిక్షణకు ఎంపికయ్యారని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు చెప్పారు. హైదరాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్ మెంట్ సంస్థ వీరికి శిక్షణ ఇస్తారని వెల్లడించారు. ప్రతిష్టాత్మకమైన సంస్థ ద్వారా కొత్త తరానికి వ్యవస్థాపక నిర్మాణంలో నైపుణ్యాలు అందించబడతాయన్నారు. శిక్షణకు నలుగురు విద్యార్థినులు మెరిట్ ద్వారా ఎంపిక చేయబడ్డారని, వీరికి ఈనెల తొమ్మిది నుంచి 29వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐడీపీ అసిస్టెంట్ కో ఆర్డినేటర్లు డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ బి.రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

### నాణ్యమైన, విలువలతో కూడిన విద్యను అందించాలి

ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖ అధికారి ఎర్రయ్య



రేపల్లె: విద్యార్థులకు నాణ్యమైన విలువలతో కూడిన విద్యను అందించి ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి అధ్యాపకులు శక్తివంచన లేకుండా పనిచేయాలని ఇంటర్మీడియెట్ జిల్లా విద్యాశాఖ అధికారి పి.ఎర్రయ్య అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం ఆయన సందర్శించి అధ్యాపకులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉంటూ ఈ విద్యాసంవత్సరం నూరుశాతం ఫలితాలు సాధించాలన్నారు. విద్యార్థుల పట్ల ప్రత్యేక చొరవ తీసుకుని అవసరమైన ప్రత్యేక తరగతులు నిర్వహించి వీరి అభ్యున్నతికి కృషి చేయాలని చెప్పారు. కళాశాలలో నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని రికార్డుల రూపంలో పొందుపరచాలని చెప్పారు. రిజిస్టర్లను, ఇతర రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులను వివిధ ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. కళాశాలలోని వివిధ ల్యాబ్‌లను, ల్యాబ్‌లలోని వివిధ పరికరాలను తనిఖీ చేశారు. గత సంవత్సరంలో ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన అనిల్ అభ్యున్నతికి కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. అనంతరం కళాశాల సిబ్బంది విద్యాశాఖ అధికారి ఎర్రయ్యను సత్కరించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు పి.సుధాకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మాట ఇచ్చాం... షాదీఖానా నిర్మించాం

- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- రూ.కోటితో నిర్మించిన ఏసీ షాదీఖానా ప్రారంభం



దాచేపల్లిలో షాదీఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

దాచేపల్లి: ముస్లిం, మైనార్టీలకు షాదీఖానా నిర్మిస్తామని ఇచ్చిన మాట మేరకు కోటి రూపాయలతో షాదీఖానా నిర్మించినట్లు గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని చాపలగడ్డలో నిర్మించిన డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం షాదీఖానాను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో కలసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ.. పల్నాడు జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఏసీ షాదీఖానా నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ముస్లింలు శుభకార్యాలు ఇక్కడే చేసుకోవచ్చునని చెప్పారు. చరిత్రలో నిలిచేలా షాదీఖానా నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. షాదీఖానా కలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నెరవేర్చటం సంతోషంగా ఉందని వెల్లడించారు. 2024లో ఇదే షాదీఖానా పైనా మరో అంతస్తు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, దాచేపల్లిలో ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు కోసం రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించనున్నట్లు తెలిపారు. దాచేపల్లి నుంచి నారాయణపురంలో ఉన్న ముస్లిం ఖబరస్థాన్‌కు వెళ్లటం ఇబ్బందికరంగా ఉందని, రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించి నాగులేరుపై లోలెవల్ చప్టా నిర్మించనున్నట్లు ప్రకటించారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ.. వైఎస్సార్ కుటుంబంతో ముస్లిం, మైనార్టీలకు విడదీయరాని అనుబంధం ఉందని చెప్పారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతోందన్నారు. ఎంపీగా తాను, ఎమ్మెల్యేగా కాసు మహేష్‌రెడ్డి నియోజకవర్గం అభివృద్ధికి శక్తివంచనలేకుండా పని చేశామని, మెడికల్ కళాశాలతో పాటుగా హైవేల ఏర్పాటుకు నిధులు తీసుకువచ్చామని ఎంపీ వెల్లడించారు. మాకు అవకాశం ఉన్నంతో అభివృద్ధి చేశామని, తమ వద్దకు ఏ పని కోసమైన సాధారణ కార్యకర్త వచ్చిన సమయం కేటాయించి పనులు చేశామని పేర్కొన్నారు. మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వాదించాలని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ షేక్ సుభానీ, షాదీఖానా నిర్మాణ కమిటీ సభ్యులు బుగ్గల జానీ, పూలకొట్టు జాని, షేక్ సైసావలి, అడ్డాలి మాబుసుభానీ, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, వైస్ చైర్మన్ షేక్ ఖాదర్‌భాషా, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, మైనార్టీసెల్ మండల శాఖ అధ్యక్షుడు సయ్యద్ మౌలాలీ, పట్టణ అధ్యక్షుడు షేక్ సైదా పాల్గొన్నారు.

# ఈఎస్ఐ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

విజయవాడ ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ జ్యోతి





మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోతి, పక్కన శ్రీచైతన్య డీన్ చంద్రశేఖర్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఈఎస్ఐ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ ఈఎస్ఐ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.జ్యోతి కోరారు. బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీచైతన్య విద్యాసంస్థల హాస్టల్ క్యాంపస్‌లో శుక్రవారం విజయవాడ ఈఎస్ఐ ఆస్పత్రి వైద్య బృందంతో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ ఈఎస్ఐ ఆస్పత్రి భాగస్వామ్యంతో ఆరోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులకు ఉచితంగా వైద్య సేవలను పొందవచ్చని అన్నారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, ఎటువంటి ఆరోగ్య సమస్యలకైనా వైద్య సదుపాయాన్ని అందిపుచ్చుకోవచ్చని అన్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలతో పాటు పాఠశాలల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ కోసం ఈఎస్ఐ ఆస్పత్రి సహకారంతో హెల్త్ చెకప్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి సారథ్యంలోని వైద్యులు బృందం దాదాపు వెయ్యి మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని విజయవాడలోని ఈఎస్ఐ ఆస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో శ్రీచైతన్య డీన్ చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ సంజయ్ పాల్గొన్నారు.

# ఫార్మా రంగంలో భారత్‌ది ప్రత్యేక స్థానం

- ఏఎన్‌యూ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ అనిత
- చలపతిలో జాతీయ సదస్సు ప్రారంభం



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరురూరల్: ఫార్మా రంగంలో ప్రపంచంలోనే భారతదేశం ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జి.అనిత అన్నారు. నగర శివారు లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సదస్సును శుక్రవారం ఆమె ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన బయోఫోర్ ఇండియా ఫార్మాసూటికల్స్, సిండిఫార్మా, విజి ఇన్‌స్ట్రుమెంట్స్ ఐవీవై, ఓవర్‌సిస్, లియో ఓవర్సీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ నైతిక విలువలకు పట్టం కడుతూ నాణ్యమైన మందులు ఉత్పత్తికి, సరఫరాతోపాటు పేషెంట్ కౌన్సెలింగ్ వరకూ వివిధ రంగాల్లో మన దేశం దూసుకుపోతుందన్నారు. హైదరాబాద్ బయోలాజికల్ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజర్ ధర్మేష్‌పటేల్ మాట్లాడుతూ నావెల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ ద్వారా నూతన పరమాణువులు, ఆవిష్కరణ ప్రక్రియ నుంచి నూతన ఔషధాలను తయారు చేయటం ద్వారా ఎన్నో వ్యాధులకు సత్వర చికిత్స అందించవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో కర్ణాటక, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి 250 మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరీ కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్‌లు అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనికుల సంక్షేమానికి సహకరించాలి

జిల్లా కలెక్టర్ శివశంకర్



ఇంటి పట్టాలు పొందిన వారితో జిల్లా కలెక్టర్ శివశంకర్, జేసీ శ్యాంప్రసాద్

నరసరావుపేట: మాజీ సైనికుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి ఆర్.గుణశీల అధ్యక్షతన నిర్వహించిన సాయుధ దళాల పతాక దినోత్సవంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ పాల్గొని సాయుధ దళాల పతాక నిధికి తమ వంతు ఆర్థిక సహాయం అందజేశారు.

కలెక్టర్ మాట్లాడుతూ భారత సైనిక దళాలు అంకితదీక్ష, దేశభక్తి, సాహసం, త్యాగాలపై దేశం గర్విస్తుందన్నారు. పాకిస్తాన్, చైనా యుద్ధాలు, కార్గిల్ పోరాటం, బొంబాయి తాజ్ హోటల్ దురాక్రమ సమయం, ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో సైనికులు ధైర్యసాహసాలు, తెగువను చూపించి ఎంతో తమ ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు. వారందరికీ మనం రుణపడి ఉన్నామని పేర్కొన్నారు. వారికి వందనం సమర్పించేందుకు వారి కుటుంబాలకు చేయూత నిచ్చేందుకు సాయుధ దళాల పతాక నిధికి ప్రతి ఒక్కరూ విరివిగా విరాళాలు అందజేయాలని పౌరులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామిక వేత్తలు, విద్యాసంస్థలకు విజ్ఞప్తి చేశారు. విజయవాడ సైనిక వెల్ఫేర్ డైరెక్టర్ పేరుపై చెక్కు, డ్రాఫ్ట్ తీసి గుంటూరు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి పంపాలని కోరారు. ఈ సందర్భంగా యుద్ధ సమయంలో ప్రాణాలు అర్పించిన మూడు కుటుంబాలకు చెందిన వితంతువులు, ఒక వీరమాతకు ఒక్కొక్కరికి ఆరు సెంట్లు (300గజాల) ఇంటి స్థలం పట్టా ఇచ్చి సత్కరించారు. ఇంటి స్థలాలు పొందిన వారిలో 1998 శ్రీలంక ఆపరేషన్, 1993, 2006 ఆపరేషన్ రక్షక్, 2012 ఆపరేషన్ మేఘదూత్‌లో పాల్గొన్న హవల్దార్లు ఖయ్యూమ్ సయ్యద్, బి.సర్తిరెడ్డి, నేలవల్లి నేతాజీ, సీఎఫ్ఎన్ పోలు రమాకాంత్‌రెడ్డి బంధువులు జీనత్ బేగమ్, వెంకటలక్ష్మి, ఎన్.వీరమ్మ, సావిత్రి రెడ్డి ఉన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం పాల్గొన్నారు.

### నేడు జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట టౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 13వ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి పి.వి.ఎస్. సూర్యనారాయణమూర్తి శుక్రవారం తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులతోపాటు సివిల్ కేసులు పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.







### ఓటు హక్కుపై విస్తృత అవగాహన

గుంటూరు కలెక్టర్ వేణుగోపాలరెడ్డి



గుంటూరు వెస్ట్: అర్హులైన ప్రతి ఒక్కరినీ, ముఖ్యంగా యువతను ఓటరుగా నమోదు చేయించేందుకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, సఫలీకృతులయ్యామని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్-2024లో భాగంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ప్రత్యేక ర్యాలీని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, స్వీప్ అధికారులతో కలసి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. నూతనంగా ఓటుహక్కు పొందిన యువత వినియోగించుకునే అవకాశముంటుందని చెప్పారు. ఇటీవల నెల రోజుల పాటు బీఎల్వోలు ప్రతి ఇంటికీ వెళ్లి నూతన ఓటర్లను నమోదు చేయించడంతో పాటు అవగాహన కల్పించారని తెలిపారు. అన్ని విద్యాలయాల్లోనూ యువతకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించామని కలెక్టర్ పేర్కొన్నారు. వాస్తవానికి గతంలో 21 ఏళ్లు నిండితేనే ఓటు హక్కు ఉండేదని, ఆ తర్వాత రాజ్యాంగ సవరణ ద్వారా 18 ఏళ్లకు కుదించారని తెలిపారు. బాధ్యతగల దేశ పౌరులుగా ఓటు హక్కును పొందడమే కాకుండా అందరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ర్యాలీ రమేష్ హాస్పిటల్ వరకు కొనసాగింది. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, జీఎంసీ అదనపు కమిషనర్ శివజ్యోతి, వృద్ధులు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ సీహెచ్. సువార్త, డ్వామా పీడీ వెంకట శివరామిరెడ్డి, డెప్యూటీ కలెక్టర్ కె.స్వాతి, అధికారులు పాల్గొన్నారు.